## నాటిక

# రంగుటద్దాలు

## ముదంశెట్టి హనుమంతరావు

[రాజశేఖరం ఇంట్లో ముందుగది. గదిమధ్య అందమైన సోఫాసెట్. . . దానిముందో చిన్న ట్రిపాయ్ ... గదికి ఓ మూల గోడని అనుకుంటూ పెట్టియున్న స్టూలు ... దానిమీద టెలిఫోను . . . కుడిపక్క బుక్‌షెల్ఫు. . . గోడలకు దేశనాయకుల ఫోటోలు ఉంటాయి. చప్పున చూస్తే, అది అంతస్తుగల ఓ వ్యక్తి ఇల్లని ఇట్టే తెలిసిపోతుంది. ప్రేక్షకులకు అభిముఖంగా లోపలికి పోయేందుకు ద్వారం ఉంటుంది. కుడివైపు వీథిద్వారం. . . రిటికీ ఖరీదైన రంగుతెరలు వేలాడుతూఉంటాయి. తెర లేచేసరికి రాజశేఖరం లోపలినించి వస్తాడు. బూడిదరంగు టెర్లిన్‌సూటులో, నీలంరంగు టై మెరుస్తూఉంటే, హుందాగా ముందుకు వస్తాడు. అదే సమయంలో బైటనించి పరమేశం వస్తాడు. పాంటు, తెల్లని బుష్‌షర్టు వేసుకుని ఉంటాడు. ఇద్దరిదీ సుమారు ఒకే వయస్సు... ]

పర: ( వస్తూనే కళ్ళింవేసి ఎవరో లాగినట్టుగా, చప్పున ఆగిపోయి) సారీ, శేఖరం. . .

రాజ: ( ఆగిపోయి, స్నేహితుడికేసి వింతగా పరికించి ) అదేమిటిరా? ఎందుకీ సారీ?

పర: ఎందుకేమిట్రా? నువ్వెక్కడికో పనిమీద బైలుదేరావా? ఇదే సమయంలో నే నెదురు పడ్డానా? ఒకవేళ ఎక్కడైనా, ఏదన్నా ప్రమాదం జరిగిందే అనుకో. పోనీ, ప్రమాదమని ఎందు కనుకోవడంలే? నువ్వు వెళ్ళిన పని కాస్త ఎదురు తిరిగిందనుకో! అప్పుడు నువ్వు నా మొహాన గట్టిగా తిట్టకపోయినా, లోలోపల శాపనార్థాలు పెడతావు, ఈ శనివెధవ ఎదురుపడ్డంవల్లనే ఈ అనర్థం జరిగిందని. ఏం? చెప్పు?

రాజ: ( నవ్వి ) అబ్బే! అలా ఎప్పుడూ అనుకోనురా. ఆ పిచ్చినమ్మకాలు లేవు నాకు.

పర: చెప్పడానికి అందరమూ అలానే చెప్తాంలేరా! అన్నీ సవ్యంగా జరిగితే, ఏ చిక్కూ ఉండదు. ఎటొచ్చీ ఏ కాస్త బెడిసికొట్టినా, అప్పుడు గుర్తుకువస్తాయి ఈ నమ్మకలన్నీను. ఇక మనసులో అదే తిట్టుకోవడం.

రాజ: సరేగాని, ఏమిటలా దిగబడ్డావ్?

పర: అర్జంటుపనిమీద వెడుతున్నావా?

రాజ: అబ్బే! ఓ స్నేహితుణ్ణి కలుసుకోవాలని వెళుతున్నా[నా]!

పర: ( రాజశేఖరంకేసి పరిశీలనగా చూసి, పొడిగా నవ్వి ) స్నేహితుణ్ణి కలుసుకునేందుకు వెళుతున్నా, ఈ సూటుధారణ అవసరమేమిట్రా? ఇలా అంటున్నానని మరేం అనుకోకేం?. . .

రాజ: సూటులో ఉంటే చురుగ్గా కనిపిస్తాం కదూ! అందుకనే.

పర: అంటే, సూటు వేసుకోనివాళ్ళలో చురుకుదనం తక్కువంటావ్. అంతేనా? అంటే, వాలో చురుకుదనం లేదనేగా నీ ఉద్దేశం?

రాజ: నీలో చురుకుదనం లేకపోవడమేమిట్రా? ఇటీజ్ అబ్సర్డ్. సీమమిరపకాయలాంటివాడివి నువ్వు.

పర: ( తీక్ష్ణంగా చూసి ) అంటే, నే నంత ఘాటైనవాణ్ణా? ఒరేయ్. . . ఈ ఉపమానం ఏమీ బావులేదు. నువ్వెంత ఆఫీసరుహోదాకి పోయినా, ఇలా నీ మిత్రుణ్ణి కించపరచడం భావ్యంగా లేదు. ఇది అన్యాయంకూడాను.

రాజ: ( విస్తుపోయి ) అబ్బ! ఇప్పుడు నే నేమన్నా[నా]! చురుకుదనానికి ఓ ఉపమానం చెప్పాన్నాను. అంతే! దీనికే నువ్విలా చిందులుతొక్కితే, ఎలా?

పర: ఇంకా నయం! చిరుతపులిలా ఉన్నానన్నావుకాదు.

రాజ: డోన్ట్ బీ సిల్లీ! మంచి చిక్కే వచ్చిందిరా నీతో.

పర: ఔ[నా]: నీ కిప్పు డలానే అనిపిస్తుంది మరి! ప్రతి విషయమూ, విసుగు కలిగిస్తుంది. అది నీ తప్పు కాదురా! నిన్ను ఓ అంతస్తులో నిలబెట్టిన భగవంతుడిది.

రాజ: ( చిన్నబుచ్చుకుని ) నే నో అంతస్తులో ఉన్నానని ఏమీ మిడిసిపడ్డంలేదురా, పరమేశం. నన్ను అపార్థం చేసుకోకు.

పర: ( విజయం సాధించినట్టుగా ముఖం పెట్టి ) అయితే, నీ ఉపమానం ఉపసంహరించు కున్నట్టేనా?

రాజ: ఉపసంహరించుకుంటున్నా[నా], బాబూ! నీతో గొప్ప చిక్కే వచ్చిపడింది. నువ్వు ప్రతి విషయానికి పెడర్థం తియ్యకు. అదే నేను కోరుకునేది. ఆఁ... కాస్సేపు కూచుందామా?

పర: ( అవోలా చూసి ) పొమ్మని ఖచ్చితంగా చెప్పేస్తే పోనా? ఈ డొంకతిరుగుడు పద్ధతులెందుకు చెప్పు? ఇది ఆఫీసర్ల సభ్యత కామోసు!

రాజ: ( విసుగ్గా ) పరమేశ్వరా! ఏం చిక్కొచ్చిందిరా నీతో? 'ఊఁ' అంటే తప్పు. . . 'ఆఁ' అంటే అపరాధమూను. రా, కూచుందాం.

( వెనక్కి వచ్చి సోఫాలో కూలబడతాడు )

పర: ( మెల్లిగా నవ్వుకుని ) అలా అన్నావు, బావుంది. ( అతనిపక్కనే కూచుంటాడు )

రాజ: ఇప్పుడు చెప్పరా, సంగతులేమిటో?

పర: సంగతులేమైనా ఉంటేనే నీ దగ్గిరికి రావాలిగాని, లేకపోతే రాకూడదా ఏమిటి? అదేదో నిర్మొహమాటంగా చెప్పేస్తే, రావడం మానుకుంటాను.

రాజ: ( చిరుకోపంతో ) ఏమిట్రా నీ గొడవ? ఏమయిం దీవేళ? పోనీ, ఏమీ చెప్పకపోతే, అలా కూచో. నాకేం?

పర: అదీ, అలా అన్నావు. . . పబబుగా ఉంది. అన్నట్టు, నీతో ఓ విషయం మాట్లాడాలని వచ్చాను. మాట్లాడ్డమేం ఖర్మ . . . అటో, యిటో తేల్చుకోవాలని వచ్చాను.

రాజ: ( తెల్లబోయి ) అటో, ఇటో తేల్చుకోవాలనా? ఏమిట్రా అది?

పర: ( తీవ్రంగా మొహం పెట్టి ) నేనడిగిన ప్రశ్నలకు సూటిగా జవాబు చెబుతావా?

రాజ: ఇదేం పరీక్షరా?

పర: పరీక్ష కాదురా! నిజం తెలుసుకోవాలనే తాపత్రయం. అయితే, దీనివల్ల నీకు కలిగే లాభం ఏమీ లేధనుకో!

రాజ: అబ్బ! చెబుతాను . . , అడగరా! ఈటెల్లాంటి మాటలతో హింసించకు మరి!

పర: అదిగో, మళ్ళీ ఘాటైన ఉపమానం. నా మాటలు ఈటెలా? ఏమిట్రా నీ ఉద్దేశం?

రాజ: ( విసుగ్గా ) అబ్బబ్బ! కాదురా, మహానుభావా, కాదు! ఈ ఉపమానాన్ని ఉపసంహరించు కుంటున్నాను.

పర: అదీ! అలా అన్నావు, బావుంది. ఆలోచించకుండా చెప్పేయాలి జవాబులు.

రాజ: అలాగే[నా] ఐ. ఎ. ఎస్. అభ్యర్థులకికూడా ఈ అగ్నిపరీక్ష ఉండదేమో! అడుగు, చెబుతాను.

పర: ఐ. ఎ. యస్. అభ్యర్థులు ఆకాశాన్నించి ఊడి పడ్డారా?

రాజ: అబ్బ! కాదులేరా! అడుగు.

పర: అంతస్తు వ్యక్తికి సంబంధించిందా? లేక, మనస్సుకి సంబంధించిందా?

రాజ: ఇదేం ప్రశ్నరా? ( మొహం అదోలా పెడతాడు )

పర: అదిగో . . . ఈ ఎదురుప్రశ్నలే నాకు ఇష్టం ఉండవు. ఇది అర్థవంతమైన ప్రశ్నే, కాదో తరవాత బోధపడుతుంది నీకు. ముందు జవాబు చెప్పు.

రాజ: వ్యక్తికి సంబంధించిందే!

పర: అదైనా ఒప్పుకున్నావు. సంతోషం. పుట్టుకతో వచ్చిందని చెప్పడంలేదు.

రాజ: ( విసుగ్గా ) అబ్బ! ఏమిట్రా నువ్వంటున్నది?

పర: తొందరపడకు. విసుగు అంతకన్నా వద్దు. వస్తున్నానా మరి! అదే, వ్యక్తికి సంబంధించిన అంతస్తుని మనస్సుకి ఆపాదించుకోడంలో అర్థం ఉందంటావా?

రాజ: అర్థం లేదంటాను. అంతస్తు అశాశ్వతమైంది.

పర: ఔనా మరి! నీకు బాగా తెలును, అంతస్తు మనస్సుకి సంబంధించింది కాదని. కాని, నీ చేతలుమాత్రం నీ భావనకి భిన్నంగా ఉన్నాయి.

రాజ: ( తెల్లబోయి ) నా చేతలా? ఏమిట్రా నువ్వంటున్నది? నాకేం అర్థం కావడంలేదు.

పర: ఔను. నీకేమీ అర్థం కాదులే. నేనేం కట్టు కథలు చెప్పడంలేదురా, అర్థం కాకపోడానికి. నిన్న నేమయిందో నీకు కాస్తయినా గుర్తుందా?

రాజ: ఏమయింది? నాకేం గుర్తుకురావడంలేదే!

పర: ఔనులే! ఎలా వస్తుంది? మరో ఆఫీసరు కామోసు —ఆయనతో నువ్వు కలిసి వస్తూంటే, ప్రాణస్నేహితుడవు కదా అని పలకరించాను. ఇప్పుడైనా గుర్తు వచ్చిందా? కాని, నా ఆలోచన నువ్వేమంటావో అని? నేనెంత అభిమానంతో, ఆప్యాయతతో పలకరించానో, అంతగా నన్ను అగౌరవపరిచావు.

రాజ: ( తెల్లబోయి ) అగౌరవపరిచానా?

పర: కాకపోతే, ఏమిటి? ఎన్నడూ పరిచయంలేని పరాయివ్యక్తిలా ఓ పొడినవ్వు నవ్వి ఊరుకున్నావు. దీన్ని ఏమనుకోమంటావో చెప్పు? ఇది అగౌరవం కాదా? ( బాధగా నిట్టూర్చి ) ఆ క్షణంలో నా హృదయం ఎంత క్షోభకు గురి అయిందో నువ్వూహించుకోగలవా, శేఖరం?

రాజ: ( చిన్నబుచ్చుకొని ) ఐ యామ్ సో సారీ పరమేశం! క్షమించమని కోరుకుంటున్నాన్రా! నాతో వస్తున్న వ్యక్తి, నా పై అధికారి. అతని సమక్షంలో . . .( చెప్పలేక నీళ్ళు నములుతాడు)

పర: ( వెటకారంగా ) ఊఁ. . . కానియ్యరా... చెప్పు మరి. అంతటితో ఆగిపోతే అందముండదు. నీ ఆంతర్యమూ తెలీదు. అతని సమక్షంలో నేను నీ స్నేహితుడనని వ్యక్తంచేసుకుందుకు న్యూనత అనిపించింది కదూ? ( చిన్నగా నిట్టూర్చి ) ఔను మరి! ఈ పరమేశంగాడు నీకు ప్రియమిత్రుడని చెబితే, వెంటనే రివర్టు చేసేస్తాడు కామోసు! అంతేకదూ, శేఖరం?

రాజ: అబ్బ! మరీ ఘోరంగా మాట్లాడుతున్నావురా! నాలో అటువంటి అభిప్రాయమేమీలేదు. కాని, ఏమిటో అప్పట్లో అలా ప్రవర్తించాను. అందుకే క్షమాపణ కోరుకుంటున్నాను.

పర: ( బరువుగా నిట్టూర్చి ) నిజమేన్రా, శేఖరం! క్షణక్షణానికీ నీ భావాల్లో పరిణామం వచ్చేస్తుంది. ఇప్పుడు నువ్వు గొప్పవాడివయ్యావుగా! కాస్తంత అంతస్తు వచ్చేసరికి అమాంతంగా గతాన్ని మరిచిపోయి, అప్పుడే దేవలోకంనుండి ఊడిపడి వట్టు భావించడం కొందరికి సహజంగా ఉండే గుణం. అంతస్తు జీవితంలో ఓ విచిత్రమైన పరిణామాన్ని తీసుకువస్తుంది. కళ్లకు రంగు టద్దాలు తగిలిస్తుంది. దాని స్వభావమది. నిన్ను అనవలిసిన పనిలేదు. ఈ పరిస్థితులలో నీతో నేను ఈపాటి చనువుగా ప్రవర్తించడం కూడా సాహసమే అవుతుంది. ( బాధగా నవ్వి ) జరిగిందేదో జరిగింది. ఇకపై జాగ్రత్త వహిస్తాన్రా! వస్తా మరి! . ( వెళ్లబోతాడు )

రాజ: ( ఆఘాతం తిని, స్నేహితుడి చేయి పట్టుకుని ఆపుతాడు ) ఏమిట్రా నీ ధోరణి, పరమేశం? ఈ చిన్న విషయానికే ఇంత రాద్ధాంతం ఎందుకు? మరీ చిన్నపిల్లాడిలా ప్రవర్తించకు.

పర: ( అదోలా నవ్వి ) నిజం చెప్పావురా, శేఖరం! నేను చిన్నపిల్లాడినే. ఇంతకంటె మా జీవితాలకు పెరుగుదల లేదు. ఉండదుకూడాను. అంతస్తుతో పాటే, వయస్సూ వస్తుందేమో మరి. వస్తా. ( విసురుగా చెయ్యి విదిలించుకుని నిష్క్రమిస్తాడు )

రాజ: ( తెల్లబోయి, ముందుకు అడుగువేస్తూ ) ఒరేయ్ . . . ఒరేయ్ . . . పరమేశం . . . మాట . . . ( పరమేశం ఆగడు. రాజశేఖరం భారంగా నిట్టూరుస్తాడు. బరువుగా అడుగులు వేసుకుంటూ వెనక్కివచ్చి, సోఫాలో కూలబడతాడు. రెండుచేతులతోను తల పట్టుకుని, ఏదో గుర్తువచ్చినవాడిలా లేచి నుంచుని, బైలుదేరతాడు )

( అదే సమయంలో, బైటనించి వాసు వస్తాడు. అతనూ రాజశేఖరం వయస్సులోనే ఉంటాడు ఇంచుమించు. టెర్లిన్ షర్టు పాంటులో టకప్‌చేసి, నీలంరంగు 'టై' కట్టుకున్నాడు. )

రాజ: అరే! నువ్వే వచ్చేశావేమిటోయ్, వాసూ? నేనూ ఇప్పుడే బైలుదేరుతున్నాను.

వాసు: ఇంతవరకూ నువ్వు వస్తావనే ఎదురు చూశాను. కాని, నో ట్రేస్ ఆఫ్ యూ! ఊరిక అలా ఎంతసేపని ఇంట్లో కూచోవడం చెప్పు? విసుగు పుట్టింది. బోర్‌కొట్టింది. భరించలేక పోయాను. అందుకని నేనే బయలుదేరి వచ్చేశాను.

రాజ: సారీ, వాసూ! అనుకోకుండా ఆలస్యం అయింది. నిజానికి చాలాసేపటిక్రితమే బయలుదేరాను. అదే సమయంలో నా చిరకాల మిత్రుడొకడు వచ్చి మాటల్లో పడేశాడు. వాణ్ణి తప్పించుకుని పోతే ఏం బాధ పడతాడోనని సాహసించలేక పోయాను. మరేం అనుకోకు. కూచో కాసేపు కాఫీ తీసుకుని పోదాం.

వాసు: ఇంటివద్ద కాఫీ తీసుకునే వచ్చాను. ఇప్పుడెందుకు లెద్దూ!

రాజ: ( చిన్నగా నవ్వి ) అలా అనడం ఈ రోజుల్లో ఫాషన్ అయిందోయ్. అయినా, మా ఇంటికి నువ్వు రావడం ఇదే ప్రథమ పర్యాయం కదూ! బొత్తిగా ఏమీ తీసుకోకుండా వెళ్లడం సభ్యతకాదు. కూచో ముందు. ( ఇద్దరూ కూచుంటారు. రాజశేఖరం మధ్యసోఫాలోను, అతనికి ఎడమ వేపున వాసు కూచుంటారు )

రాజ: అన్నట్టు అడగడం మరిచాను — మా ఇల్లు చప్పున ఎలా గుర్తుపట్టావు?

వాసు: (నవ్వి) మంచి ప్రశ్నే ? అడ్రసు ఇచ్చావుగా? ఇక గుర్తుపట్టడానికి ఇబ్బందేముందని?

రాజ: ఔను కదూ! ఊఁ . . . సరే, ఇప్పుడు చెప్పు— కాఫీ తీసుకుంటావా? లేక, కూల్‌డ్రింకా?

వాసు: కాఫీయే తెప్పించు.

రాజ: సరే ! ఇప్పుడే వస్తానుండు. ( లేస్తాడు )

( అప్పుడే రామ్మూర్తి లోపలినించి వస్తాడు. వయస్సు అరవైదగ్గిర ఉంటుంది. అంత వయస్సయినా, వంగిపోలేదు మనిషి. మోకాలువరకూ పంచె, వదులుగా తెల్లని బనీనువేసుకుని ఉంటాడు. భుజంమీద రంగుతువ్వా లుంటుంది. అతణ్ణి వాసు చప్పున చూస్తాడు. )

వాసు: నువ్వెందుకు వెళ్లడమోయ్! అదిగో, మీ నౌకరు గామోసు వస్తున్నాడు. అతడికి చెబితే తీసుకు వస్తాడు.

రాజ: ( వెనక్కి చూస్తాడు. కూర్చుండిపోతాడు. రామ్మూర్తి దగ్గిరగా రావడంతోనే మెల్లిగా చెపుతాడు ) రామ్మూర్తిగారూ! లోపలికి వెళ్లి, కాఫీ తీసుకురండి.

రామ్మూ: ( మొహం దించుకుని వెనక్కితిరిగి ) అలాగే, బాబూ! (లోనికి వెళ్లిపోతాడు మెల్లిగా )

వాసు: (వింతగా) అదేమిటోయ్, రాజశేఖరం, నౌకర్ని బహువచనంలో సంబోధిస్తున్నావు? ఆశ్చర్యంగా ఉందే?

రాజ: నీ కిది ఆశ్చర్యంగా అగుపించవచ్చు, వాసూ! కాని, నాకుమాత్రం అలా పిలవడం, పరిపాటి అయింది. దానికి కారణం లేకపోలేదు. ఈయన నా చిన్నప్పటినించి నన్ను ఎత్తుకుని, ఆ చేతుల మీదుగా పెంచిన వ్యక్తి. అందుకే, ఈ గౌరవం. ఈయన్ని మా ఇంట్లో ఓ వ్యక్తిగా పరిగణిస్తాం.

వాసు: ఎంత పాత నౌకరయినా, ఎంత నిన్ను ఎత్తుకుని పెంచినవాడయినా బొత్తిగా తారతమ్యం ఉంచకుండా ప్రవర్తించకూడదు, శేఖరం. ఒక్కొక్కప్పుడు ఈ చిన్న పొరపాట్లే విషమ పరిస్థితులకు దారితీస్తాయి.

రాజ: (చిన్నగా నవ్వి ) అది వట్టి భ్రమ. మన జాగ్రత్తలో మనం ఉంటే, అటువంటిది ఎప్పుడూ జరగదు. ఆ నమ్మకం నాలో ఉంది.

వాసు: అయినా, ఇంత వయస్సుమళ్లినవాణ్ణి నౌకరుగా ఇంకా ఉంచడం ఏమిటి చెప్పు? నౌకరన్నవాడు ఎంత హుషారుగా, చురుగ్గా ఉండాలి?

రాజ: అది నేనూ కాదనను. అయితే, ఇప్పుడు చెప్పానుగా — ఈయన మా ఇంట్లో ఓ వ్యక్తిగా మసలుతున్నాడని. అదే కారణంవల్ల ఈయన్ని విడిచిపెట్టుకోలేకపోతున్నాం. వాసూ ! నౌకరు హుషారుగా ఉన్నంతమాత్రాన నమ్మకస్తుడనుకోలేంకదూ? నమ్మకస్తులైనవాళ్ళు వృద్ధులైనా, అనుమానం ఉండదు.

వాసు: నువ్వెన్ని చెప్పూ, నాకుమాత్రం ఇదేమీ నచ్చలేదు. నీకు తెలీదుగాని, ఇటువంటి విషయాల్లో మా నాన్నగారు చాలా ఖచ్చితంగా ఉంటారు. ఆమధ్య నేను గుంటూరులో ఉంటున్నప్పుడు, మా ఇంట్లో, ఓ ముసలాయన నౌకరుగా ఉండేవాడు. మా నాన్నగారు వారంరోజులు నాదగ్గిర ఉండడానికని వచ్చి, ఆ నౌకర్ని మార్చేవరకూ నిద్ర పోలేదంటే నమ్ము. అంత పట్టుదల ఆయనకి. ( రామ్మూర్తి అప్పుడే 'ట్రే'తో రెండు కప్పుల కాఫీ తీసుకు వస్తాడు. చెరో కప్పు అందిస్తాడు.)

వాసు: ( కాఫీ తాగుతూ ) అన్నట్టు, మీ నాన్నగారిని పరిచయంచేశావు కాదోయ్?

రాజ: (తడబాటుతో తాగుతూన్న కాఫీని మింగలేక గుటక వేస్తాడు )ఆయన ప్రస్తుతానికి ఇంట్లో లేరు, వాసూ! ఈసారి నువ్వు వచ్చినప్పుడు పరిచయంచేస్తాలే ! ( రామ్మూర్తికేసి తిరిగి ) మీరు వెళ్లండిక, రామ్మూర్తిగారూ!

వాసు: (రామ్మూర్తిని పరికించి చూస్తూ ) ఇతడిలో నౌకరుకి ఉండవలిసిన లక్షణాలేవీ లేవోయ్.

శేఖరం. బ్రతికి చెడినవాడిలా కనిపిస్తున్నాడు. ( రామ్మూర్తిని ఉద్దేశించి ) అన్నట్టు, వీరిది ఏ ఊరోయ్?

రాజు: ( కంగారుపడి ) వాసూ! ఆయన్ని నే నెలా గౌరవిస్తున్నానో ప్రత్యక్షంగా చూశావుగా! నువ్వూ అదే పద్ధతి అవలంబించాలని నా కోరిక. ఎంతయినా, వయసులో మన తండ్రివంటివారు.

వాసు: ఓ! ష్యూర్! ష్యూర్! తప్పకుండాను. నౌకర్ని ప్యూన్ అని సంబోధించవద్దని ఇటీవల ప్రభుత్వమే ఒక తాఖీదు జారీచేసిందని విన్నాను. మనుషులంతా ఒకటే అయినా, ఈ అంతరాలెందుకని వారి భావన కామోసు! అందుచేత మనంకూడా గౌరవనీయమైన పద్ధతే అవలంబించడం శ్రేయస్కరమే, మరి! అయినా ప్రభుత్వ విషయాలు ఇక్కడెందుకులే! ఇంతకీ చెప్పారు కాదు, రామ్మూర్తిగారూ, ఏ ఊరండీ మీది?

రామ్మూ: ( నిట్టూర్చి ) ఎక్కడ ఉంటే అదే నా ఊరు, బాబూ!

వాసు: గుడ్! మంచి జవాబు. అయితే, రామ్మూర్తిగారూ, మా శేఖరం ఇంట్లో మీరు నౌకరుగా ఉండటం మీ అదృష్టమే అంటాను. మీరేమంటారు?

రామ్మూ: నిజం, బాబూ! చాలా అదృష్టవంతుణ్ని. ఈ అదృష్టం జన్మజన్మలకీ ఉండాలనే భగవంతుణ్ని ప్రార్థిస్తున్నాను.

రాజు: వాసూ! ఇప్పు డవన్నీ ఎందుకు? పోదాం, పద.

వాసు: వెళదాం లేవోయ్! రామ్మూర్తిగారు ఎంత చక్కగా మాట్లాడుతున్నారో చూశావా? ( రామ్మూర్తితో ) నిజం చెప్పాలంటే, మిమ్మల్ని చూస్తూఉంటే ఓ విధమైన జాలి కలుగుతుందండీ! మీరు ఒకప్పుడు బాగా బ్రతికినవారు కదూ?

రాజు: ( విసుగ్గా ) ఈ ప్రశ్నలన్నీ ఇప్పు డెందుకు, వాసూ?

వాసు: శేఖరం! కొన్ని విషయాలు అనుకోకుండా ఆసక్తి పెంచుతూఉంటాయి. మరికొన్ని విముఖత కలిగిస్తాయి. విముఖత కలిగించే విషయాలు వినడానికి మనస్కరించదు. అలాగే ఆసక్తిని కలిగించేవాటిని ఆరాతియ్యడం, మానవుని లక్షణం. అందులోనూ నా సంగతి నీకు తెలిసిందేగా! ఏ విషయాన్నయినా తేలిగ్గా తీసుకోవడం నాకు చేతనవదు. ఆలోచిస్తాను. ఆరా తీస్తాను. ( రామ్మూర్తితో ) ఏమండీ, రామ్మూర్తిగారూ! ఒకప్పుడు బాగా బ్రతికినవారు కదూ?

రామ్మూ: ( నిట్టూర్చి ) ఇప్పుడుమాత్రం నాకేం లోటు, బాబూ? ఆర్థికంగా నాకేం లోటు లేదు.

వాసు: మీ మొహమే చెబుతూం దా విషయం.

రాజు: ( కలిగించుకుని ) ఆయనకేంలేరా!

రామ్మూ: ఔను, బాబూ! నాకేం? మా అబ్బాయి మంచి ఉద్యోగంలో ఉన్నాడు.

వాసు: ( ఆశ్చర్యంగా ) ఏమిటీ! మీవాడు మంచి ఉద్యోగంలో ఉన్నాడా? ఏమిటండీ, ఆ ఉద్యోగం?

రాజు: ( విసుగ్గా ) ఏదో చేస్తున్నాడు లెద్దూ!

వాసు: అబ్బ! నువ్వుండవోయ్, శేఖరం. ( రామ్మూర్తితో ) ఏమిటండీ, ఆ ఉద్యోగం?

రామ్మూ: ఏమిటో తెలీదుగాని, బాబూ, పెద్ద ఉద్యోగమే. నెలజీతం అయిదువందలపైచిలుకే సంపాదిస్తున్నాడు.

వాసు: అయితే, ఏ ఆఫీసరో అయిఉండాలన్నమాట!

రామ్మూ: అయిఉండవచ్చు, బాబూ! అందుకే నా కీ నిశ్చింత! వాడింకా అభివృద్ధిలోకి రావాలనే నే నెప్పుడూ కోరుకుంటూ ఉంటాను. వాడంటే నాకు ఆరోప్రాణం, బాబూ! ఈ జీవితంలో నాకు మాత్రం ఇంకేం కావాలి?

వాసు: మరయితే, నాకు తెలియక అడుగుతాను, రామ్మూర్తిగారూ, మీవాడు ఆఫీసరు హోదాలో ఉంటూంటే, మీరు 'రామా, కృష్ణా' అంటూ మీ శేషజీవితాన్ని నిశ్చింతగా గడుపుకోక, ఇంక ఈ నౌకరు ఉద్యోగం ఎందుకు చేస్తున్నట్టు చెప్పండి?

రాజు: ( విసుగ్గా ) నువ్వో అపరాధ పరిశోధకుడిలా ఇవన్నీ ఆరాతియ్యడమేమిటోయ్, వాసూ?

వాసు: ( అదోలా నవ్వి ) ఆరా తియ్యాలి, శేఖరం. ఆరా తీస్తేనే ప్రతి వ్యక్తి జీవితంలోనూ ఏవో అగాథాలు అగుపిస్తూఉంటాయి. లేకుంటే, అవి గుప్తంగా ఉండవలిసిందే! వాటి ఉనికి ఎవ్వరూ తెలుసుకోరు.

## స్నేహాలు

ఎండలో మనం నడిచేటప్పుడు మనకు చేరువుగానే ఉంటూ నీడలో అడుగుపెట్టగానే త్యజించే నీడవంటివాళ్లు దొంగస్నేహితులు.

—దానీ

* * *

## బంగారం

బంగారాన్ని మీ హృదయంలో కంటె చేతిలోనే భద్రపరుచుకోవటం ఉత్తమం.

ఫుల్లర్

రామ్మూ: ( గట్టిగా ఓ నిట్టూర్పు విడిచి ) నిజం చెప్పావు, బాబూ! ప్రతి వ్యక్తి జీవితంలోనూ అగుపించని అగాథాలుంటాయి. వాటిని శోధించి, కనుగొంటేనేతప్పించి, అవి అగుపించవు. అవి వివిధ రూపాల్లో ఉంటాయి. నాలోకూడా ఏవో అగాథాలు ఉన్నాయని మీరనుకోవడం తప్పుకాదు, బాబూ! అయితే, దీనికి కారణం ఒక్కటే. అనుబంధం! అదే బాబూ, నా హృదయానికి కాళ్ళకూ బంధాలు వేసి, కదలనివ్వకుండా చేస్తూంది. ఈ అనుబంధానికి అంత శక్తి ఉంది, బాబూ!

వాసు: మీ హృదయం నవనీతం, రామ్మూర్తిగారూ! మిమ్మల్ని నౌకరుగా పరిగణించడంకంటె, కుటుంబంలో ఓ వ్యక్తిగా, ఆత్మీయుడుగా పరిగణించడమే సమంజసంగా ఉంది. మా శేఖరం మీ కెందు కింత గౌరవాన్నిస్తున్నాడో ఇప్పు డర్థమయిందండీ!

రామ్మూ: ( బాధగా నవ్వి ) మీ కింక అర్థంకావలిసింది చాలా ఉంది, బాబూ!

వాసు: ( ఆశ్చర్యంగా అతనికేసి చూసి ) ఏమిటీ? అర్థం కావలిసింది చాలా ఉందా? ఏమిటండీ అది?

రాజు: ( కలిగించుకుని ) వాసూ! అనవసరంగా కాలయాపన జరుగుతూందోయ్. పోదాం, పద.

వాసు: ఎందు కంత తొందరపడుతున్నావో నాకేం బోధపడడంలేదు, శేఖరం. కాలయాపన అనుకోవడానికి మనకేం రాచకార్యాలు లేవుగా అవతల! కాస్సేపు ఆగవోయ్. ( రామ్మూర్తితో ) చెప్పండి, రామ్మూర్తిగారూ! నాకు అర్థంకావలిసిందేమిటో చెప్పండి, మీకు అభ్యంతరం లేకపోతేను సుమండీ!

రాజు: ( నిట్టూర్చి ) నిజం చెప్పుకోవడానికి అభ్యంతరమేమిటిలే, బాబూ! నా బాహ్యస్వరూపం చూసి, నా మొహంలో వెలిగే తృప్తిరేఖల్ని చూసి నేనెంతో ఆనందంగాఉన్నానని, సుఖసంతోషాలతో జీవితాన్ని గడిపేస్తున్నానని అంతా అనుకుంటారు.

వాసు: నిజానికి, మీలో ఆనందం లేదా?

రామ్మూ: 'ఆనందం' అన్న పదానికి నిర్వచనం ఏమిటి, బాబూ? డబ్బూ, దర్పం ఉన్నంతమాత్రాన ఆనందంఉంటుందంటారా? అలాఅనుకోవడమే పెద్ద పొరపాటంటాను నేను. మానసికంగా కలిగే ఆనందమే నిజమైన ఆనందం. అదే తృప్తి. ఆ ఆనందమే నాలో లోపించింది, బాబూ!

వాసు: ఏమిటండీ మీరంటున్నది?

రామ్మూ: ఔనుబాబూ! అదేమీకు తెలియదంటున్నాను. మావాడు ఉద్యోగమైతే మంచిదే చేస్తున్నాడు. నలుగురిలోహోదాగా, గౌరవంగాజీవిస్తున్నాడు. కాని... కాని... ( అతని గొంతు బొంగురుపోతుంది )

వాసు: ( ఆసక్తిగా కాని. . . ఏమిటండీ? చెప్పండి.

రాజు: వదవోయ్, వాసూ! ఎందుకీ ప్రశ్నలన్నీను?

వాసు: అబ్బ! ఉండవోయ్. ఏమిటి మరీ బొత్తిగా సభ్యత లేనట్టుగా మాట్లాడతావు, వయోవృద్ధులు తమ కష్టసుఖాలు, తమ అనుభూతులు చెబుతూంటే, అవేమీ మనకు పట్టనట్టుగా లేచివచ్చి వెళ్ళడం భావ్యంగా ఉండదు. మానవత్వం ఏపాటి ఉన్నవాళ్ళయినా, అలా వెళ్ళలేరు. చెప్పండి, రామ్మూర్తిగారూ!

రామ్మూ: ఏం చెప్పడం, బాబూ? మా వాడికి అంతస్తు మైకం కమ్మింది. అనుబంధాలు ఎలా ఉన్నా, ఆత్మీయత ఏమైపోయినా అంతస్తుమాత్రం దెబ్బతినకూడదన్న తత్త్వం వాడిది. ఈ మనస్తత్త్వం వాడిలోని మానవత్వాన్ని నాశనం చేసిందనుకుంటాను. విచక్షణ జ్ఞానాన్ని మట్టిలో కలిపింది. ( నిట్టూర్చి ) నేను వాడి సమక్షంలో ఉండగా ఎవరైనా స్నేహితులు — అంటే వాడిలానే అంతస్తులో ఉన్న స్నేహితులు — తారసపడితే, నన్ను వాడి తండ్రిగా పరిచయం చేసుకోడు, బాబూ! అలా పరిచయం చేసుకోవడం అవమానంగా భావిస్తాడో ఏమో మరి! ఇంతకంటె కన్న

తండ్రికి ఇంకేం శిక్ష కావాలి, బాబూ, ఇంకేం శిక్ష కావాలి?. . . (రుద్ధస్వరంతో అని మొహం దించుకుంటాడు. అతని కళ్ళు చెమ్మగిల్లుతాయి)

వాసు: (విస్తుపోయి) ఎంత అన్యాయమండీ! తండ్రి పట్ల గౌరవభక్తులు లేనివాడు ఏ అంతస్తులో ఉంటేనేం? ఎంత డబ్బు ఆర్జిస్తుంటేనేం? ఇది ఘోరం. . . అక్రమం. . . అన్యాయం. ఇటువంటివి సహించలేను సుమండీ. కోపంతో ఒళ్ళు మండిపోతుంది.

రాజ: (వినుగ్గా) రామ్మూర్తిగారూ! ఇప్పుడు ఇవన్నీ ఎందుకండీ? లోపలికి వెళ్ళం డిక.

రామ్మూ: (రాజశేఖరంకేసి తిరిగి) అవసరం, అవకాశం వచ్చాయి కాబట్టి చెప్పుకొనీ, బాబూ! అలా చెప్పుకుంటే, నా హృదయంలో పేరుకున్న ఆవేదన కరిగి, కాస్తంత ఉపశమనం కలుగుతుంది. (నిట్టూరుస్తాడు)

వాసు: ఇంతకీ, మీవాడు మిమ్మల్ని ఏవిధంగా పరిచయం చేస్తాడేమిటి?

రామ్మూ: (బాధగా) ఏం చెప్పను, బాబూ? అప్పటికి ఏం తోస్తే అది. ఇంటినౌకర్నని చెప్పడానికి కూడా వెనకంజ వెయ్యడు. ఇదీ వాడి పితృభక్తి! ఇదీ వాడికి నామీద ఉన్న గౌరవం! అందుకే వాడిదగ్గిర ఉండటం ఇష్టపడదు నాకు.

రాజ: (గట్టిగా నిశ్వాసం వదిలి) వివరాలు తెలుసుకున్నావుగా, వాసూ! ఇక పోదాం, పదవోయ్.

వాసు: తెలుసుకున్నానుగాని, ఇవన్నీ వింటూవుంటే నా శరీరం కోపంతో ఎలా మండిపోతూందో తెలుసా, శేఖరం? ఈ సభ్యమానవ సంఘంలో అటువంటి వ్యక్తులకు చోటు ఉండకూడదు. ఇది విన్నాక నీకేమీ అనిపించలేదూ? నాకేం అనిపిస్తుందో తెలుసా? అతను నా కళ్ళఎదుట ఉంటే. . . (ఏదో అనబోయి ఆగిపోతాడు)

రాజ: ఆవేశం తెచ్చుకోకోయ్, వాసూ!

రామ్మూ: (బాధగా నవ్వి) ఔను బాబూ! శేఖరం బాబు చెప్పింది నిజం. మీరు ఆవేశం తెచ్చుకోకూడదు. దానివల్ల ప్రయోజనం లేదు. అయినా, ఎవరి మనస్సు వారివల్లనే మారాలిగాని, మరొకరి పరంగా మారడం ఎలా సాధ్యపడుతుంది, చెప్పండి? (ఆవేదనతో) కనీ, పెంచీ, పెద్దవాణ్ణి చేసిన నన్ను, వాడి అంతస్తును దృక్పథంలో ఉంచుకొని దిగజారుతున్న వ్యక్తికి, పరాయివాళ్ళు ఎన్ని అనుకున్నా లెక్కేమిటి? అసలు ఆ జ్ఞానమే ఉంటే, ఈ అంతస్తనే అజ్ఞానంలో పడి ఉండేవాడు కాదు. ఇదంతా నా దురదృష్టం బాబూ! ఏం చెయ్యను చెప్పండి?

వాసు: (సానుభూతితో) మీ గాథ వింటూంటే నా హృదయం కన్నీరు కారుస్తూంది, రామ్మూర్తిగారూ! మీ రనుభవిస్తున్న ఆవేదన ఊహించుకుంటూంటే, నా కేమిటో కడుపులో దేవుతున్నట్టుగా ఉంది. కాని, ఒక్క విషయం. ఎప్పటి కయినా మీవాడు తన తప్పు తెలుసుకుంటాడు. పశ్చాత్తాపపడతాడు. ఆ నమ్మకం సాలో ఉంది. ఇది జరిగితీరుతుంది. చూడండి, అక్రమం ఎన్నాళ్ళు సాగుతుంది?

రామ్మూ: వాడి తప్పు ఎప్పుడో తెలుసుకునిపశ్చాత్తాపపడతాడో లేదోగాని బాబూ, ఇప్పుడుమాత్రం నా హృదయం దహించుకుపోతూంది. ఈ ఆవేదన ఎవరితో చెప్పుకోవడం చెప్పండి? (చెమ్మగిల్లిన కళ్ళను ఒత్తుకుంటాడు)

వాసు: బాధపడకండి రామ్మూర్తిగారూ! మీరు వయోవృద్ధులు. ప్రపంచానుభవం పుష్కలంగా ఉన్నవారు. మీకు నేను చెప్పవలిసిందేముంది? మీలో సహనం ఉండాలి. మీ పిల్లల తప్పులు మీరే ఓర్పుతో, ఔదార్యంతో సహించి, క్షమించకపోతే, ఇతరు లెవరు క్షమిస్తారు చెప్పండి?

రామ్మూ: మీ మాటలు వింటూంటే నా హృదయం ఆనందంతో గంతులేస్తూంది, బాబూ! నిన్ను గన్న తలిదండ్రు లెంతో అదృష్టవంతులు. అది వారి పూర్వజన్మ సుకృతం.

వాసు: (శేఖరంతో) శేఖరం! విన్నావు కదోయ్, రామ్మూర్తిగారి గాథ. హృదయాన్ని కదిలించే గాథ. నేను ఆరాతియ్యడంవల్లనేగా ఈ రహస్యం బైటపడింది? లేకపోతే, ఆయన చెప్పేవాడా?

రాజ: పోనీ విన్నావుగా! ఇక పద.

(అప్పుడే పరమేశం బైటనించి వస్తాడు)

పర: (వస్తూనే) ఒరేయ్, రాజా . . . రాజా! హమ్మయ్య! ఉన్నావు కదా! బైటికి వెళ్ళిపోయి ఉంటావేమోననుకున్నాను.

(రామ్మూర్తి కంగారుగా కళ్ళు ఒత్తుకుని కాఫీ కప్పులు 'ట్రే'లో పెట్టి తీసుకుపోతూ ఉంటాడు. పరమేశం ఆయన్ని చూసి దిగ్భ్రమ చెందుతాడు)

పర: నమస్కారమండీ, రామ్మూర్తిగారూ! మీరేమిటి, కాఫీకప్పులు తీసుకువెళ్ళడమేమిటి? నౌకరు లేడూ? ఏమిట్రా రాజా! మీ నాన్నగారు కాఫీకప్పులు తీసుకువెళుతూంటే అలా కళ్ళప్పగించి చూస్తున్నావేమిటి? ఏమిట్రా ఇదంతా?

వాసు: (ఆఘాతం తిన్నట్టుగా) ఏమిటీ? వీరు . . . వీరు . . . (తడబడతాడు)

పర: ఔనండీ! వీరు మా రాజా ఫాదర్!

వాసు: ఎంత పొరపాటు జరిగింది! (రామ్మూర్తిగారి దగ్గిరికి పోయి, అతని చేతిలో ఉన్న ట్రే తీసుకుని 'టీపాయ్' మీద పెడతాడు) క్షమించండి, సార్! మీకు జరిగిన ఈ అవమానానికి నేను కుంగిపోతున్నాను. నా హృదయం ఆక్రోశిస్తూంది. రాజశేఖరం ఇటువంటివాడని ఇంతవరకూ నాకు తెలీదు. (రుసరుసలాడుతూ శేఖరంకేసి చూస్తాడు)

రాజ: (మొహం చెల్లక, అవనతముఖుడై తండ్రికి దగ్గిరగా వెళతాడు) క్షమించండి నాన్నా! నేను చేసింది క్షమించరాని తప్పేఅయినా, మన్నించమని కోరుకుంటున్నాను. కేవలం అంతస్తు కోసమే చూశానుగాని, అనుబంధాన్ని గుర్తించుకోలేకపోయాను. అంతస్తుల రంగుటద్దాలు నాలో అనేకమైన ఊహల్ని రేకెత్తించాయి. ఆత్మీయుల్ని మరపింపజేసినట్టు, భ్రమ కలిగించాయి. ఆ భ్రమలో పడి నేను శిఖరంలో నిలబడిపోయాను. మిమ్మల్ని అవమానపరిచి, ఆత్మవంచన చేసుకున్నాను. భగవంతుడుకూడా నన్ను క్షమించడు నాన్నా! (రుద్ధస్వరంతో అంటాడు) క్షమించడు.

వాసు: (చిరుకోపంతో) ఈ మాటలు అనడానికి కూడా నీకు అర్హత లేదు, శేఖరం. నీ అంతస్తు మైకంలో ఆ మహానుభావుణ్ణి, ఆ సహనశీలిని అక్రమంగా, అసభ్యంగా, అన్యాయంగా అవమానించావు! ఈ అవమానం నిజంగా ఎవరిదంటావు? నువ్వు ఆయన్ని ప్రత్యక్షంగా అవమానిస్తున్నా, కించపరుస్తున్నా సహనంతో, ఓర్పుతో పరిస్థితిని అర్థం చేసుకుని ప్రవర్తించిన మీ నాన్నగారిదా? లేక, ఆత్మీయతా గౌరవం భక్తీ, అన్నీ విడిచిపెట్టి అసభ్యంగా ప్రవర్తించిన నీదా? ఒక్కసారి తార్కికంగా ఆలోచించు . . . నీకే బోధపడుతుంది. ఇంతకీ ఏమిటోయ్ నీ అభిప్రాయం? నీ తండ్రిగారుకూడా నీ వలెనే ఇంట్లో సూటు వేసుకుని తిరగాలా? ఆ ఆడంబరం ఉంటేనేగాని, నీ అంతస్తుకి తగ్గ వ్యక్తిత్వం రాదంటావా? ఎంత సంకుచితమైన మనస్తత్వం నీది, శేఖరం? అది ఈనాడే తెలుసుకున్నాను. నువ్వు నా స్నేహితుడవని చెప్పుకుందుకే సిగ్గు వేస్తుంది.

రాజ: (బొంగురుగొంతుతో) నిజం, వాసూ! నువ్వన్న ప్రతి పదంలో అర్థం వుంది. నేను చాలా దిగజారిపోయాను. (బాధపడతాడు)

వాసు: ఇప్పు డనుకుని ఏం లాభం?

రామ్మూ: పోనీలే బాబూ! జరిగిందేదో జరిగింది. ఇంతకు ముందెప్పుడూ ఇలా ప్రవర్తించలేదు. క్షణకాలం ఏదో బలహీనతకు లోనైఉంటాడు. దానికేంలే... (కొడుకుకేసి చూసి) రాజా! నువ్వేమీ బాధపడకురా! కనీసం ఇప్పటికయినా నీ భ్రమ గుర్తించావు... అది చాలు.

వాసు: చూశావోయ్, శేఖరం, మీ నాన్నగారి సహృదయత! ఇదే మనకీ, వారికీ వ్యత్యాసం.

పర: (ఏమీ అర్థంగాక తెల్లబోతూ) ఇంతకీ ఏమయిందండీ? నాకేమీ అర్థం కావడంలేదే!

వాసు: ఇంకేమవుతుందండీ! వీరిని మన శేఖరం వాళ్ళ నౌకరుగా పరిచయం చేశాడు.

పర: (నిర్ఘాంతపోయి) ఆఁ నౌకరుగానా? (కోపంతో శేఖరంకేసి చూసి) ఏమిట్రా, రాజా, ఆఖరికి ఇంతగా దిగజారిపోయావన్నమాట! నీ అంతస్తు రంగుటద్దాల్లో నీకు అందరూ హీనంగా అగుపిస్తున్నారన్నమాట. నాలాంటి స్నేహితుల్ని ఎలా కించపరిచినా ఫరవాలేదురా! కాని, కన్నతండ్రిని, నిన్ను పెంచి పెద్దచేసి, ఈ స్థితికి తెచ్చిన తండ్రిని ఈ విధంగా కించపరచడానికి నీ మన స్సెలా ఒప్పిందిరా? నీలో ఉన్నది హృదయమా? లేక రాతిబండా?

రాజు: ( రుద్ధస్వరంతో ) పరమేశం! చచ్చినపాముని ఇంకా కొట్టడమెందుకు?

రామ్మూ: బాబూ, పరమేశం! ఇంక వాణ్ణేమీ అనద్దు, బాబూ! చేసిన తప్పు తెలుసుకుని పశ్చాత్తాపంతో కుంగిపోయినవాడే నిజమైన మనిషి. మనిషి మారడానికి పశ్చాత్తాపం చాలు బాబూ!

వాసు: రామ్మూర్తిగారూ! మీవంటి అమృతహృదయం గల తండ్రిని పూజించాలండీ! మీ మంచితనాన్ని ఆధారంగా తీసుకునే శేఖరం ఇలా తయారయ్యాడేమోననిపిస్తోంది.

పర: అంతేకాదండోయ్! నేను ఇంత ప్రాణస్నేహితుణ్ని! నాకూ ఇలాంటి అవమానమే సంప్రాప్తమయింది. ఆ క్షణంలో నేనూ బాధపడ్డాను. అందుకే కొద్ది సేపటిక్రితమే వచ్చి, ఆ ఉద్రేకంలో ఏదేదో అనేసి వెళ్ళిపోయాను.

వాసు: ( శేఖరంకేసి తిరిగి ) అంతస్తు వచ్చినంత మాత్రాన ఆత్మీయత, అనుబంధం మరిచిపోకూడదు, రాజశేఖరం. ఈ అంతస్తు అశాశ్వతమైంది. ఈ రోజు ఉండచ్చు... రేపు పోవచ్చు. మళ్ళీ రావచ్చు. కాని, ఆత్మీయత ఒకసారి పోగొట్టుకుంటే, తిరిగి వచ్చేది కాదు. అది అమూల్యమైనదోయ్!

రాజు: ( బాధగా నిట్టూర్చి ) పొరపాటు జరిగింది, వాసూ! అందుకు నాలో నేనే కుమిలిపోతున్నాను. నిజానికి, నాన్నగారిని కించపరచాలనే అభిప్రాయం నాకు ఎన్నడూ లేదు. మా నాన్నగారిని చూసి, నువ్వు నౌకరు వస్తున్నాడని అనేసరికి నాలో మెరుపులా, ఏదో మార్పు వచ్చేసింది.

వాసు: ఇప్పు డర్థమయింది, శేఖరం. ఇందులో కొంత తప్పు నాదీ ఉంది. నీ పశ్చాత్తాపాన్ని నేనూ పంచుకుంటున్నాను. నా విషయంలోకూడా ఇటువంటి పొరపాటు ఇంకెప్పుడూ జరక్కుండా జాగ్రత్తపడతాను. రామ్మూర్తిగారూ, నన్నూ క్షమించాలి మీరు.

రామ్మూ: అబ్బే! అలా అనకు, బాబూ! ఇందులో నీ తప్పేమీ లేదు.

రాజు: ఔను, వాసూ! నీ తప్పు లేదు. నీ అభిప్రాయాన్ని ఖండిస్తూ, నిజం నేను చెప్పచ్చునుగా! అంచేత తప్పంతా నాదే! నాన్నా, క్షమించాననండి. అంతవరకూ నా హృదయం తేలికపడదు.

రామ్మూ: ( నవ్వుతూ కొడుకు భుజం తట్టి ) మనలో మనకేమిట్రా? అయినా, కోరుతున్నావు గాబట్టి క్షమించానులే. . . ( వాసుతో ) వస్తాను, బాబూ!

వాసు: మంచిదండీ! (నమస్కరిస్తాడు) అప్పుడప్పుడూ వస్తూ ఉంటానులెండి. ఈసంఘటననీ, మిమ్మల్నీ, నా జీవితంలో ఎప్పుడూ మరిచిపోలేనండీ! ( రామ్మూర్తి కళ్ళల్లో ఆనందబాష్పాలు మెదులుతాయి. కళ్ళు ఒత్తుకుంటూ లోపలికి పోతాడు.)

పర: రాజా! చూశావురా, అంతస్తు మైకం తెచ్చిన అపచారం! ఎవరైనా వింటే నవ్వుతారుకూడాను.

రాజు: ఇదేమీ జరగలేదనుకుని, మరిచిపోదాం.

పర: అలాగే! ఇందాకా ఆ విసురులో అసలు విషయం చెప్పకుండానే వెళ్ళిపోయాను.

రాజు: ఏమిటది?

పర: నాకు ఇన్‌స్పెక్టరుగా ప్రమోషన్ వచ్చిందిరా!

రాజు: చాలా సంతోషంరా!

పర: వచ్చినా నీలా ప్రవర్తించనురా!

రాజు: అబ్బ! మరి చంపకురా! మరిచిపో ఆ విషయం.

వాసు: కంగ్రాచ్యులేషన్స్! ( పరమేశంతో చేయి కలుపుతాడు . . . అప్పుడే ఏదో గుర్తువచ్చి రాజశేఖరంకేసి తిరగుతాడు ) అన్నట్టు, ఈ మిత్రుడెవరో పరిచయం చేశావు కాదోయ్ శేఖరం.

రాజు: సో సారీ, వాసూ! ఈ తుపానుమధ్య, ఈ విషయమే గుర్తుకు రాలేదు.

పర: నువ్వు సృష్టించిన తుపాను అను మరి.

రాజు: అబ్బ! అదే అనుకో! వాసూ! వీడు నా చిరకాల మిత్రుడు. పరమేశం... ఉరఫ్ .. సీమమిరపకాయ ( నవ్వుతాడు ).

పర: (తీవ్రంగా) అదిగో! ఆ ఘాటు ఉపమానమే వద్దంటాను.

రాజు: (నవ్వుతూనే) సారీ! మరి అనను లేరా ఈయన నా మిత్రుడు వాసుదేవరావు . . . నా కొలీగ్. (వాసు, పరమేశం మళ్ళీ చేతులు కలుపుతారు)...

పర: (పరిహాసధోరణిలో) చంపేశారు . . . రెండు అంతస్తులమధ్య నే నెలా ఉండటం?

వాసు: ( నరదాగా నవ్వి ) మీరు తమాషాగా మాట్లాడతారండీ పరమేశంగారూ! అటువంటి అంతరాలేమీ పెట్టుకోకండి. మన శేఖరంకూడా ఆ రంగుటద్దాల్ని తీసేశాడుగా! ఏరా, శేఖరం?

రాజు: ఇంకానా! ఇప్పటికే అనుభవం చాలు.

వాసు: ఉద్యోగం వేరు, నిత్యజీవితం వేరు. నిత్యజీవితంలో వ్యత్యాసాలు ఉండకూడదు. ఈ సత్యాన్ని గుర్తుంచుకుంటే చాలు. అలా తిరిగివద్దాం పదండి ... (ముందుకు సాగిపోతాడు. అతనివెంట పరమేశం, రాజశేఖరం, ఒకర్నొకరు చూసుకుని నవ్వుకుంటూ పోతారు)

—తెర—

*

## కొత్త పుస్తకాలు

'కొత్త పుస్తకాలు' శీర్షికకింద సమీక్షకొరకు పుస్తకాలు పంపేవారు ఒక్కొక్క పుస్తకానికి రెండు ప్రతులు చొప్పున ఈ దిగువ చిరునామాకు పంపాలి:

ఎడిటర్
ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక
ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్
మద్రాసు - 2

ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలు సాగించడం జరగదు.

—ఎడిటర్.

## ఫోటోగ్రాఫర్లకు విజ్ఞప్తి

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురణార్థం పరిశీలనకు ఫోటోలు పంపేవారు ఈ దిగువ సూచించిన అంశాలు గమనించాలని కోరుతున్నాము:

1. ఫోటో ప్రింట్లు మాత్రమే పంపాలి. నెగెటివులు పంపరాదు.
2. గ్లాసీ పేపరు ప్రింట్లు పంపడం మేలు.
3. సైజు: కనీసం 2½ అం. × 3½ అం. 10 అం. × 12 అం. కు మించరాదు.
4. ఫోటోలు 'ఎడిటర్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్, మద్రాసు—2' కు పంపవలసి ఉన్నది.
5. ప్రచురణార్థం కాని ఫోటోలు తిరిగి పంపడానికి తగుమాత్రం తపాలా బిళ్లలు ఉన్న, చిరునామాకలిగిన కవరు జతపరచవలసి ఉన్నది.
6. ఈ విషయమై ఉత్తర ప్రత్యుత్తరాలు జరపడం సాధ్యంకాదు.

ఫోటోగ్రాఫర్ల సహకారం సదా అర్థిస్తున్నాము.